
# మనిషి-విలువ

కుసుమ



విజయవాడ రైల్వే ప్లాట్ ఫారమ్ జనంతో కిటకిటలాడుతూంది. ప్రయాణీకుల హడావుడి. పిల్లల కేకలు, కూలీల అరుపులు. అప్పుడే రాజమండ్రి నుంచి వచ్చి ఆగిన రైలు యింజను మోత. ఒక్క మాటలో చెప్పాలంటే — తొలి చూలాలు పురిటి నొప్పులు పడుతున్నట్లుగా ఉంది.

ప్లాట్‌ఫారమ్‌మీది సిమెంటుబెంచిమీద కూర్చున్న రామశర్మ లాల్చీ చేయిని పైకి త్రోసుకుని చేతిగడియారము చూచుకున్నాడు. హైద్రాబాద్‌వెళ్ళే ఎక్స్‌ప్రెస్ మద్రాసునుంచిరావటానికి యింకా పదిహేను నిమిషాలుంది.

తిరిగి పేపర్లో తలదూర్చాడు రామశర్మ.

"అయ్యా! బాబయ్యా!! ఒక్కపైస దానం చేయండి."

రామశర్మ తల ఎత్తి చూచాడు. ఎదురుగా చిరిగిన లాగుతో, చింపిరి జుట్టుతో, వొంటికి చొక్కా లేకుండా, చేయి చాచి యాచిస్తున్నాడు - పదిహేనేండ్ల కుర్రాడు.

ఆ కుర్రాడు ఎందుకు యాచించి బ్రతకవలసి వచ్చిందో రామశర్మకు అర్థం కాలేదు. ఆ ఒక్కొక్క పైస యాచించే కాలాన్ని కష్టంలో యిరికిస్తే యిష్టమైన భోజనం దొరుకుతుంది ఇంకెంతో ముందు జీవితాన్నుంచుకుని యిప్పట్నుంచే అడుక్కు తింటూ బ్రతకటం - బద్ధకాన్ని. సోమరితనాన్ని ఏర్పరచుకోవటం అవుతుంది. యాచన ఫలితము శూన్యమైనప్పుడు కాలే కడుపును ఆర్పుకుంటానికి. దొంగతనాలు. దోపిడీలు. దౌర్జన్యాలు చేయటం జరుగుతుంది. ఒక విధంగా దానం చేయటం అందుకు దోహద మిస్తుందేమో! తోటకూర నాడే మందలిస్తే కోటవరకెందు కెడుతుంది వ్యవహారం.

"మీకు పుణ్యముంటుంది ఒక్క పైస దానం చేయండి."

ఆ కుర్రాణ్ణి దగ్గరగా పిలచాడు రామశర్మ. ఆ కుర్రాడు ఆశగా రామశర్మ దగ్గరికి వచ్చాడు.

"నీకు శరీరస్థితి మంచిగానే ఉంది. ఒక్కొక్క పైస ఒక్కొక్కర్ని అడుక్కొనకపోతే ఏ ఒక్కరికో యింత కష్టంచేసిపెట్టి సుఖంగా బ్రతక్కూడదురా!"

"యిదిమాత్రం కష్టంకాదు బాబయ్యా!"

వాడి అతి తెలివికి రామశర్మకు చుర్రుమనుకుండింది. ఇలాంటి వెధవలకు మాటలు మూంచి పోయగానే వస్తాయి. రానిదే...! యింతవరకూ బ్రతుకుతూ వచ్చాడా ... సిగ్గు లేకపోతేసరి.

తిరిగి ఆ కుర్రాడు "ధర్మం చేయండి. ఆకలి దహించుకపోతుంది" అన్నాడు. వాడిమాటలో అర్థింపు. కన్నుల్లో దీనత్వం ప్రతిఫలిస్తూంది.

పైసకొరకు వాడు చూపుతున్న నక్క వినయం రామశర్మకు ఎక్కడలేని కోపాన్ని కలిగించింది. ఇలాంటి వెధవలకు దానధర్మాలు చేయబట్టే. దేశములో బద్ధకస్తులు. సోమరులు ఎక్కువ తయారయ్యారు. వీలుచిక్కినప్పుడు నక్క జేబులుకూడా చూస్తారు.

"ఒక్క పైస దానం చేయండి బాబయ్యా!" తిరిగి కండ్లింత చేసుకుని ఆశగా ఆ కుర్రాడు — అడిగాడు.

"దానం చేయటానికి ఒక హద్దూ-పద్దూ ఉండాలిరా! కుంటివాండ్లకూ. గుడ్డివాండ్లకూ దానం చేయాలి. నీకు లేకపోయినా మా కుండాలి, ఆ బుద్ధి" అంటూ కసురుకున్నాడు రామశర్మ. ఆ కుర్రాడు యింత ముఖం చేసుకుని మెల్లగా జారుకున్నాడు.

వాడు వెళ్ళినవేపు ఒక్క క్షణం కోపంగాచూచి రామశర్మ సిగరెట్ తీసుకుని వెలిగించుకున్నాడు. అగ్గిపుల్ల గిరాటేస్తుండగా ఎవరిదో చేయి భుజంమీద పడింది. రామశర్మ తల త్రిప్పిచూచి 'ఓ! శ్రీరంగం నువ్వేట్రా!" అన్నాడు. ఆశ్చర్యపోయి.

శ్రీరంగం ప్రక్కగా వచ్చి కూర్చున్నాడు.

"శారీరకంగా నీలో ఎదుగు బొదుగు లేదురా! రామశర్మ. నిన్ను గుర్తుపట్టడం పెద్ద కష్టం పెంకాలేదు."

రామశర్మ సమాధానంగా నవ్వాడు.

"ఇంతకీ నువ్వు యిప్పుడు ఇంటికి వెడుతున్నట్టా?" తిరిగి శ్రీరంగమే ప్రశ్నించాడు.

"అమ్మకు సీరియస్‌గా ఉందని ఉపయుక్తే

చెక్కు అందింది వెంటనే బయలుదేరేను రా.. రా కాఫీ త్రాగి వద్దాం" అంటూ లేచాడు రామశర్మ

చాలా కాలం తరువాత కలుసుకున్న మిత్రులిద్దరు ఆనందంగా కబుర్లాడుకుంటూ కాఫీ త్రాగారు. శ్రీరంగాన్ని వారించి రామశర్మ బిల్లు చెల్లించాడు.

"అయ్యా బాబయ్యా! ఒక్క పైస దానం చేయండి"

తల త్రిప్పి చూచాడు రామశర్మ. అదే — ఆ కుర్రాడు. రామశర్మ ముఖం రంగులు మారింది

ఆ కుర్రాడు రామశర్మని గుర్తించి చిత్రంగా కళ్ళు త్రిప్పి మెల్లగా జారుకున్నాడు. ఈ విచిత్ర సంఘటన శ్రీరంగాన్ని ఆశ్చర్యపరచింది.

"ఆ కుర్రాడు అలా చూస్తూ వెళ్ళి పోయాడేమిటిరా"

రామశర్మ సమాధానంగా చిరునవ్వు నవ్వి గాఢంగా సిగరెట్ దమ్ము లాగాడు. యింతలో 'పెద ఇద' మంటు పెద్దగా రొదిస్తూ మద్రాస్ ఎక్స్‌ప్రెస్ వచ్చి స్టేషన్‌లో ఆగింది. బెల్లం చుట్టూ మూగిన ఈగల్లా జనం ఒక్కసారిగా ఎగబ్రాకింది. ఎక్కేవాండ్లకీ, దిగేవాండ్లకీ భీకర పోరాటం ప్రారంభమైంది. రామశర్మ అతి కష్టంమీదలోనికి ప్రవేశించి రెండు సీట్లు ఆక్రమించాడు. చాలా సేపటి తరువాత శ్రీరంగం లోనికి ప్రవేశించి రామశర్మ ప్రక్కన కూర్చుంటూ ఒక నిట్టూర్పు విడిచి 'హాయిగా బ్రతికాం. ఇలాంటి వెధవ ప్రయాణాలు చేయాలంటే పీకలమీదికి కొస్తుంది. ఏం చేస్తాం మరి. తప్పదుగా! ఎప్పటికప్పుడు జాగ్రత్త తీసుకోవాలి."

'మరి యింత జాగ్రత్త తీసుకోకబట్టే శరీరం మోడువారేదిగా తయారైంది" అంటూ నవ్వాడు రామశర్మ

ఎక్స్‌ప్రెస్ కూత పెట్టింది.

మధిర దాటిన తరువాత జనం కాస్త పలుచబడింది. టి టి. లోన ప్రవేశించి టిక్కెట్టు అడుగుతూంటే ప్రక్కజేబులో చేయిదూర్చి నివ్వెరపోయాడు రామశర్మ.

"మిమ్మల్నే అడుగుతుంది టిక్కెట్టు"

రామశర్మకు నోటమాట పెగల్లేదు జేబులన్నీ తడుముకున్నాడు.

'జేబు కత్తిరించారా' ఆశ్చర్యపోతూ అడిగాడు శ్రీరంగం.

తలూపాడు రామశర్మ.

రామశర్మకు చచ్చినంత పనైంది. తలొంచుకున్నాడు. చివరికి ఖమ్మంస్టేషన్ వస్తుందనగా అభిమానాన్ని చంపుకుని అడిగాడు. సారీ అంటూ శ్రీరంగం ముఖం త్రిప్పుకొన్నాడు. రామశర్మ నిలువునా నీరైనాడు ఆ క్షణములో శ్రీరంగం మీద ఎక్కడలేనికోపం వచ్చింది. కాఫీ త్రాగుతుండగా శ్రీరంగం జేబులో పదిరూపాయిలనోటు చూశాడు. ఆపదలో అభిమానాన్ని చంపుకుని అడిగినప్పటికీ లేదన్నాడు ద్రోహి.

శ్రీరంగం ముఖం చూడాలంటే అసహ్యం కలిగింది. టి టి తో పాటు ఖమ్మంస్టేషన్‌లో దిగాడు రామశర్మ.

తనవయసు ప్రతిష్ఠ మట్టిపాలైనట్లు బాధపడ్డాడు రామశర్మ. అతని అభిమానం, అంతర్యం పూర్తిగా గాయపడింది. అంతకంటే ఎక్కువగా తల్లి అనారోగ్యం కన్నులముందు మెదిలింది.

రామశర్మ కన్నుల్లో నీరు తిరిగింది.

"ఒక్క పైస ధర్మం చేయండి బాబయ్యా"

అప్రయత్నముగా తలఎత్తి చూచాడు రామశర్మ అదే - ఆ కుర్రాడు చేయిచాచి యాచిస్తున్నాడు.

రామశర్మకు ఎక్కడలేని కరుణ ముంచుక వచ్చింది. ఆ క్షణములో జేబులో చేయి దూర్చి దానంచేయబోయాడు. తన నిస్సహాయత తలపుకు వచ్చి కుమిలిపోయాడు. ఒక్క పైస దానంచేయటానికి నిరాకరించిన తన దగ్గర యిప్పుడు ఒక్క పైస కూడా లేదు.

'కరుణించండి బాబయ్యా'ంటే - కన్నీరు కారుస్తారేం" ఎంతో ఆత్మీయతను కురిపిస్తూ దగ్గరగా వచ్చాడు ఆ కుర్రాడు.

ఆ మాత్రం దగ్గరగా వచ్చి అడగ్గలిగిన ఆ కుర్రాణ్ని చూచి రామశర్మలో మమతానురాగం పొంగులు వారింది.

జీవితములో ఒక మంచి స్నేహితునికి చెప్తున్నట్లుగా, జరిగినదంతా చెప్పి ఓదార్పు పొందాడు రామశర్మ.

అంతా విన్న తరువాత ఆ కుర్రాడు, ఒక అడుగు ముందుకు వేసి, "మీరు ఏమీ అనుకోకపోతే; బాబయ్యా..." అంటూ నసుగుతూ జేబులోంచి చిల్లరతీసి "తీసుకోండి బాబయ్యా అక్కడ పరిస్థితి ఎలా వుందో! కన్నబిడ్డ కోసం కండ్లలో వత్తులేసుకుని గంపెడాశతో ఎదురుచూస్తుంది ఆ అమ్మ."

ఎక్స్‌ప్రెస్ భీకరంగా ఘర్జించింది.

'అలా చూస్తారేం బాబయ్యా మీ లాంటి ధర్మప్రభువులు దానం చేసినవే కాలం కాటేసినప్పుడు ఎవరేం చేస్తారు." అంటూ రామశర్మ జేబులో చిల్లర పోస్తుంటే; ఒక సుందర మనోజ్ఞ దివ్యహస్తం జీవితం తాలూకు తేజస్సు దీప్తితం చేస్తున్నట్లుగా అనిపించింది.

తిరిగి ఎక్స్‌ప్రెస్ కూతపెట్టింది.

ఔటర్ సిగ్నల్ దాటేంతవరకు ఖమ్మం ప్లాట్‌ఫారమ్ మీద నిలుచున్న ఆ కుర్రాణ్ణి చూస్తుండిపోయాడు రామశర్మ.

★

# మళ్ళీ వసంతం

నిన్న అస్తమించిన భానుడు ఈ ఉదయం మళ్ళీ
నవ నవోత్తేజంతో అరుణ కిరణాలు ప్రసరిస్తున్నాడు.
భర్తృ నిరాకృతల్లా శిశిరంలో చిన్నబోయిన పాదప పడతులు
ఈరోజు చిగురాకు చీరలలో క్రొత్త అందాలతో మెరుస్తున్నారు
మోడువారిన ప్రకృతిని చూసి, మూగవోయిన కోయిల గొంతు
ఈవేళ పారవశ్యంతో మరింత మధురంగా పలుకుతోంది
కళదప్పి కంటకావృతాల్లా కనిపించిన లతా నికుంజాలు
నేడు చైత్రమాసపు పుష్పలతలతో పుడమితల్లి వేసిన పూలసెంపుల్లా భాసిస్తున్నాయి.
వెలువరించలేని భావాలతో వెలితిగా కనుపించిన జగతి
ఎదిసి కాముని ఆమెతతో కనులవిందు గొలుపుతోంది,
ఈరోజు నిన్నకాదు - నిన్న'ను మరిపించాలని
పగిలిన నీ హృదిపై సుధావృష్టి కురిపించాలని
నీ నిరాశా నయనాలముందు ఆశాలతలు మెరిపించాలని
నీ బాధల పరిసమాప్తికై స్వర్గద్వారం తెరిపించాలని
వచ్చింది నీ జీవితంలో మళ్ళీ వసంతం....
యవ్వనపు నవక్రొత్త సొగసులు నింపుకొన్న కన్నెయలా
పరిమళాలు వెదజల్లే అరవిచ్చిన అనాఘ్రాత పుష్పంలా
చైతన్యమే ప్రాణంగా పరుగిడుతున్న సెలయేరులా
నిన్ను మళ్ళీ ఒక "క్రొత్తమనిషి" గా రూపొందించాలని
వచ్చింది నీ జీవితంలో మళ్ళీ వసంతం!

—వైదేహి